
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 4 జూన్ 2025



కాలువల్లో పనులు చేశాకే..

- సాగునీటి సలహామండలి సమావేశంలో ఎమ్మెల్యేలు, సాగునీటి సంఘాల అధ్యక్షులు
- 10న సాగునీరు విడుదల చేసే అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని నిర్ణయం

సాగునీరు విడుదల చేయాలి

పంట కాలువలు, బుడమేరు గండ్లు పూడ్చుకుంటే సాగు ప్రశ్నార్థకమే!

డ్రెయిన్లలో పూడిక తీయకుంటే పంటలు మునిగిపోవడం ఖాయం

"పంట కాలువల్లో, డ్రెయినేజీల్లో గుర్రపు డెక్క, నాచు, కిక్కిస, తూడు పెరిగిపోయాయి. కాలువల్లో ఇప్పటి వరకు పూడికతీత, కాలువల నిర్వహణ (ఓఅండ్ఎం) పనులు ప్రారంభించనేలేదు. ఇలాంటి స్థితిలో కృష్ణాడెల్టాకు సాగునీరు విడుదల చేస్తే అన్ని ప్రాంతాలకు సకాలంలో నీరు చేరదు. కాలువల్లో పనులు చేశాకే సాగునీటిని విడుదల చేయాలి" అంటూ జిల్లాలోని ఎమ్మెల్యేలు, సాగు నీటి సంఘాల అధ్యక్షులు డిమాండ్ చేశారు. మంగళవారం జెడ్పీ సమావేశపు హాలులో 42వ సాగు నీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. గన్నవరం, పామర్రు, పెడన ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్ తమ నియోజక వర్గాల్లో పంట కాలువలు, డ్రెయినేజీ దుస్థితిని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ నెల 10వ తేదీన కృష్ణాడెల్టాకు సాగు నీటిని విడుదల చేస్తే ఉపయోగం ఉండదని, కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తదితరాలను తొలగించే పనులు పూర్తి చేసి, ఆ తర్వాతే సాగునీటిని విడుదల చేస్తే ఉపయోగం ఉంటుందని స్పష్టం చేశారు.

-ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం



సాగునీటి సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, వేదికపై ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్

కలెక్టర్ ఫోన్ చేస్తే గాని పనులు చేయరా!

పామర్రు నియోజకవర్గంలోని ఐనంపూడి, కొమరవోలు డ్రెయినేజీల్లో కాంట్రాక్టర్ ఇంకా పనులు ప్రారంభించలేదని ఎమ్మెల్యే కుమార్ రాజా, సాగు నీటి సంఘాల అధ్యక్షులు కలెక్టర్ బాలాజీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై కలెక్టర్ బాలాజీ అధికారులను నిలదీశారు. 45 రోజుల క్రితమే పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పామని, ఏ కారణంతో పనులు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడుతూ కలెక్టర్ ఫోన్ చేసి మీతో మాట్లాడే వరకు పనులు ప్రారంభించరా.. బుధవారం పనులు ప్రారంభించి సంబంధిత ఫొటోలు తనకు పెట్టాలని చెప్పారు. నామినేషన్ పద్ధతిన సాగునీటి సంఘాలకు కేటాయించిన ఓఅండ్ఎం పనులను త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, పంట కాలువల్లో ఓఅండ్ఎం పనులు ప్రారంభించని నేపథ్యంలో కృష్ణాడెల్టాకు సాగునీటిని విడుదల చేసే తేదీని ఈ నెల 20వ తేదీకి వాయిదా వేయాలని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ ఎస్ఈ మోహనరావు, వ్యవసాయశాఖ జేడీ మనోహరరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కె.స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, హేలా షారోన్, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

10న నీటి విడుదలపై సందిగ్ధం

జిల్లాకు సాగు నీటిని ఈనెల 10వ తేదీన విడుదల చేయాలని కోరుతూ తీర్మానం చేయాలని సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా తొలుత సూచించారు. అయితే పంట కాలువలు, డ్రెయినేజీల్లో ఓఅండ్ఎం పనులు చేయకపోవడంతో కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తదితరాలు పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయనే అంశం చర్చకు వచ్చింది. దీంతో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంట్రావు మాట్లాడుతూ పంట కాలువల్లో అసలు పనులు ప్రారంభించకుండా సాగునీటిని విడుదల చేస్తే ఎంతమేర ఉపయోగం ఉంటుందనే అంశంపై అధికారులు సమాధానం చెప్పాలన్నారు. రామవరప్పాడు కాలువ పరిధిలో 48వేల ఎకరాల మిగతా 6లో..

పెడన నియోజకవర్గానికి ముందస్తుగా నీరు విడుదల చేయాలి

పెడన నియోజకవర్గం కాలువ శివారు ప్రాంతంలో ఉండటంతో ముందుస్తుగానే వెదజల్లే పద్ధతిన రైతులు వరి నాట్లు పూర్తి చేస్తారని, పూర్తిగా వరి సాగుపైనే రైతులు ఆధారపడి ఉన్నారని, పెడన నియోజకవర్గానికి ముందస్తుగానే సాగు నీటిని విడుదల చేయాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. అర్తమూరు, కృత్తివెన్ను, పెందుర్రు, నాగేశ్వరరావుపేట, వడ్లమన్నాడు, ఇసుకపర్ర డ్రెయిన్‌లలో పూడికతీత పనులు అసలు చేయలేదన్నారు. ఈ పనులు వెంటనే చేయాలని అధికారులకు సూచించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణాడెల్టాకు సాగునీరు విడుదల చేసేందుకు ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇక ఎలక్ట్రిక్ బస్సులు!

విద్యాధరపురం డిపోకు 100 బస్సుల కేటాయింపు

- జూలైలో విజయవాడకు రానున్న సర్వీసులు
- ఈ నెల 18 నుంచి 26 వరకు సీనియర్ డ్రైవర్లకు హైదరాబాద్‌లో శిక్షణ



ఈకేపీ ఎలక్ట్రిక్ బస్సు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు మరో నెలన్నర రోజుల్లో ఆర్టీసీకి రాబోతున్నాయి. ఈకేప గ్రీన్ మొబిలిటీ సంస్థ ద్వారా రూపుదిద్దుకున్న ఎలక్ట్రిక్ బస్సులు ప్రస్తుతం బాడీ బిల్డింగ్‌ను పూర్తి చేసుకుంటున్నాయి. జూలై రెండు లేక మూడో వారంలో ఆర్టీసీకి ఈ బస్సులు రానున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు పలుమార్లు బాడీ బిల్డింగ్ పనులను పరిశీలించారు. వీటిని నడిపేందుకు డ్రైవర్లను సన్నద్ధం చేస్తున్నారు. పీఎం ఈ-బస్ పథకంలో భాగంగా విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో అతి త్వరలో 100 ఎలక్ట్రిక్ బస్సులు నడవనున్నాయి. ఈ బస్సులన్నీ కూడా విద్యాధరపురం బస్ డిపోకు కేటాయించారు. ఈ బస్సులు వచ్చే లోపు ఆ డిపో డ్రైవర్లకు డ్రైవింగ్ శిక్షణ ఇప్పించాలని అధికారులు మిగతా 6లో..

మసులా 2కె రన్ జోష్



6

మంగినపూడిలో ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న మసులా బీచ్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని మచిలీపట్నంలో మంగళవారం 2కె రన్ నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, సినీ నటులు నారా రోహిత్, మంచు మనోజ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు తదితరులు ఉత్సాహంగా పాల్గొని యువతలో స్ఫూర్తిని నింపారు. మసులా బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం.. బందరు ప్రాభవాన్ని దేశం నలుమూలల చాటి చెబుదాం అంటూ నినదించారు.

అవనిగడ్డలో నాలుగు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం 6

సాల్ట్ భూములపై కన్ను!

గుట్టు చప్పుడు కాకుండా 30 ఎకరాల్లో తవ్వకాలు

- అధికారులకు సమాచారం ఇచ్చిన రైతులు
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

బంటుమిల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సాల్ట్ భూములపై అక్రమార్కులు కన్నేశారు. గుట్టు చప్పుడు కాకుండా 30 ఎకరాల్లో తవ్వకాలు చేపట్టారు. రైతుల సమాచారంతో స్పందించిన రెవెన్యూ అధికారులను అడ్డుకుని యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బంటుమిల్లి మండలం కొర్లపాడు పంచాయతీ పెదపాండ్రాక రెవెన్యూ పరిధిలో సుమారు 89 ఎకరాల సాల్ట్ భూమి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ఈ భూములపై పెద్దల కన్ను పడింది. దీనిని కబ్జా చేసి చెరువులుగా మార్చేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గుట్టు చప్పుడు కాకుండా దాదాపు 30 ఎకరాల సాల్ట్ భూముల్లో ఎక్స్‌కవేటర్లు దించి పనులు ప్రారంభించారు. స్థానిక రైతులు గమనించి అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన బంటుమిల్లి రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం చేసుకుని పనులు నిలిపివేశారు. సర్వే నెంబరు 147లో ఉన్న ఈ ప్రభుత్వ భూమి 89.91 ఎకరాలు. ఆటుపోట్లు వచ్చిన సమయంలో సముద్రపు నీరు ఈ భూమిలో చేరుతుంది. దీనిని సాగు చేసి ఉప్పు పండించేవారు. కేవలం ఉప్పు తప్ప ఏ ఇతర పంట పండదు. గతంలో తూర్పు, మిగతా 6లో..



సాల్ట్ భూమిని చెరువులుగా తవ్వుతున్న అక్రమార్కులు

ఏసీబీ వలలో చిక్కిన అటవీశాఖ అధికారి

టింబర్ డిపో లైసెన్సు రెన్యువల్‌కు రూ. 18 వేలు డిమాండ్

లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం): టింబర్ డిపో లైసెన్స్ రెన్యువల్ చేసేందుకు రూ.18 వేలు లంచం తీసుకుంటూ అటవీశాఖ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ బి.వి.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నానికి చెందిన వనం రవీంద్రనాథ్ మచిలీపట్నంలో శ్రీజ టింబర్ డిపో నడుపుతున్నారు. ఈ టింబర్ డిపో లైసెన్స్ గడువు ముగియడంతో రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి జి.జయప్రకాష్ చుట్టూ రెండు నెలలుగా తిరుగుతున్నారు. ఈ క్రమంలో జయప్రకాష్ రూ.25వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో చివరకు రూ.18వేలు ఇస్తే టింబర్ డిపో లైసెన్స్‌ను పునరుద్ధరిస్తామని అటవీశాఖ అధికారి బేరం కుదుర్చుకున్నారు.



ఏసీబీకి పట్టుబడిన అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి జి.జయప్రకాష్

లంచం ఇవ్వటం ఇష్టంలేని రవీంద్రనాథ్ ఈ విషయంపై ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ బి.వి.సుబ్బారావుతోపాటు మరో 15 మంది సిబ్బంది మంగళవారం మిగతా 6లో..

చిక్కిన చైన్ స్నాచర్లు!

- నిందితుల్లో ఒక రౌడీషీటర్, ఒక విద్యార్థి
- పరారీలో మరో ఇద్దరు యువకులు
- నున్న ప్రాంతానికి చెందిన వారిగా గుర్తింపు
- గొలుసు చోరీలకు ముందు బైక్ చోరీ

8



మహిమాన్విత శైవక్షేత్రం పృథ్వీశ్వరాలయం

6



కొండపల్లి రైల్వేస్టేషన్ వద్ద సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

- రాయనపాడులో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు
- త్వరలో మూడు ఆర్వోబీల నిర్మాణ పనులు ప్రారంభం
- ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నుంచి అభివృద్ధికి నోచుకోని కొండపల్లి రైల్వేస్టేషన్ శాటిలైట్ స్టేషన్ అవ్వాలనే ఈప్రాంత వాసుల చిరకాల స్వప్నం త్వరలో నెరవేరుతుందని, రాయనపాడు స్టేషన్‌లో మరిన్ని రైళ్ల ఆగేలా చర్యలు తీసుకోవడంతో పాటు రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, కూటమి నేతలతో కలిసి మంగళవారం ఆయన కొండపల్లి, రాయనపాడు స్టేషన్లు, గొల్లపూడి, కొండపల్లిలో ఆర్వోబీలు ఏర్పాటు చేయనున్న డ్రెయిన్ల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, విజయవాడ స్టేషన్‌లో రద్దీ నియంత్రించేందుకు రాయనపాడు స్టేషన్‌ను అమృత్‌భారత్ కింద రూ.12.13 కోట్లతో శాటిలైట్ స్టేషన్‌గా తీర్చిదిద్దుకుందని, త్వరలో స్టేషన్ ప్రారంభిస్తారన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, కొండపల్లి స్టేషన్ కల కూడా సాకారం చేస్తామన్నారు. స్టేషన్ అభివృద్ధి చేస్తే ఖిల్లా పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. త్వరలో కొండపల్లి, ఈలప్రోలు ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. స్టేషన్ అభివృద్ధిపై నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. కూటమి నేతలు జంపాల సీతారామయ్య, చెన్నుబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, చుట్టుకుదురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, కలెక్టరు బాలాజీ

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నయం

- స్క్రీనింగ్ టెస్ట్ వాహనాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

కృత్తివెన్ను, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు పరీక్షలు చేసి, తగిన చికిత్స అందించటం వల్ల క్యాన్సర్‌ను నయం చేయవచ్చని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చినగొల్లపాలెంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ మొబైల్ వాహనాన్ని కలెక్టర్ డీకే బాలజీ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లతో కలిసి ఎంపీ ప్రారంభించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో రూ.4 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్, డయాగ్నస్టిక్ యూనిట్ జీవన్ రథ్ బస్సు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు తొలి దశలోనే క్యాన్సర్‌ను అత్యాధునిక పరీక్షల ద్వారా గుర్తించి తద్వార చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా మహిళలు అపోహలు వీడి పరీక్షలు చేయించుకొనేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట, వైద్యులు హీన, సూర్య, జడ్పీటీసీ రత్నకుమారి, సర్పంచ్ సునీల్, బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

విజయవాడ డివిజన్‌కు ఐఎస్‌వో గుర్తింపు

రైల్వేస్టేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ ట్రాక్షన్ పంపిణీ విభాగానికి ప్రతిష్టాత్మక ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికేషన్ లభించింది. భారతీయ రైల్వేలో తొలిసారిగా ఈ సర్టిఫికెట్‌ను దక్కించుకున్న డివిజన్‌గా విజయవాడ నిలిచింది. ఈ మేరకు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తమ డివిజన్‌కు క్వాలిటీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ లభించటం ఎంతో గర్వకారణమన్నారు. సేవలు, నాణ్యతకుగాను సమగ్ర ఆడిటింగ్ తరువాత క్యూఆర్‌వో సర్టిఫికేషన్ హైదరాబాద్‌లోని హర్ష టెక్నాలజీ ద్వారా జారీ చేయబడిందన్నారు. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీహెచ్ దినేష్ రెడ్డి, డిపార్టుమెంట్ బృందానికి డీఆర్ఎం అభినందనలు తెలిపారు.

చర్లపల్లి-రామనాథపురం ప్రత్యేక రైలు పొడిగింపు

రైల్వేస్టేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా ప్రయాణికుల రద్దీ నిమిత్తం దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి-రామనాథపురం మధ్య ప్రత్యేక రైలును కొంతకాలం పొడిగిస్తున్నట్టు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07695 చర్లపల్లి-రామనాథపురం రైలు ప్రతి బుధవారం ఈనెల 11 నుంచి 25వరకు కొనసాగుతుంది. 07696 రామనాథపురం-చర్లపల్లి ప్రతి శుక్రవారం ఈనెల 13 నుంచి 27వరకు కొనసాగుతుంది. ఇవి నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై, ఎగ్మోర్, చెంగల్‌పట్టు, విల్లుపురం, తిరుప్పదిరిపుల్లియార్, చిదంబరం, శిర్ఘాసి, మైలాదుతురై, తిరువాయూర్, తిరుతరైపూండి, అభిరామపట్టణం, పత్తుకొట్టై, అరంతంగి, కరైకుడి, శివగంగ, మన్మదురై స్టేషన్‌లలో ఆగుతాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్‌లు అనుసంధానించబడతాయి.

రేపట్నుంచి ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

భారతీనగర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు గురువారం నుంచి విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులు మినహా ఇతర కేటగిరీల వారు రూ.60 డిపాజిట్ చెల్లించాలని, ప్రైవేట్ ఐటీఐలో చేరే అభ్యర్థులు వారి నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కౌన్సిలింగ్ తేదీ అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ వస్తుందన్నారు. మెరిట్ నంబరు కోసం విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐలోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468లో సంప్రదించాలన్నారు.



మంగినపూడి బీచ్ ఫెస్టివల్‌కు సిద్ధమవుతున్న కళాకృతులు



అందరి చూపు బందరు వైపు..

జాతీయ స్థాయి ఉత్సవంలా మసులా ఫెస్ట్, బీచ్ ఫెస్టివల్‌కు రానున్న 15 లక్షల మంది పర్యాటకులు.. 25 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మసూలా బీచ్ ఫెస్టివల్ 2025 జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మంగినపూడి బీచ్‌ని మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదతరులతో కలిసి సందర్శించారు. జలక్రీడలను పర్యవేక్షించారు. గుర్రపుస్వారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, 2018 అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రెట్టించిన ఉత్సాహంతో 5వ తేదీ నుంచి బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఫెస్టివల్‌లో 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, బీచ్‌కబడ్డీ, వాలీబాల్, జలక్రీడల్లో పాల్గొంటారన్నారు. కొలంబస్, జెయింట్ వీల్ పిల్లలకు ఏర్పాటు చేశామన్నారు. సాహసక్రీడల్లో భాగంగా హెలీ రైడింగ్, ప్యారా గ్లైడింగ్, బోటింగ్ ఏర్పాటు చేశామన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ, రోల్డ్‌గోల్డ్ నగలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల రుచులతో ఏడు జోన్లలో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుచేశామన్నారు. 80 అడుగుల అమరావతి ఐకానిక్ నిర్మాణం, అసెంబ్లీ టవర్‌లు పర్యాటకులకు కనువిందు చేస్తాయన్నారు. వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. కొనకళ్ల మాట్లాడుతూ, 2018లో ఉత్సవాలలో 10 లక్షల మంది పాల్గొన్నారని, ఇప్పుడు 15 లక్షల వరకు వస్తారన్నారు. మంగినపూడి బీచ్‌ని పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఆకట్టుకునేలా వివిధ కళాఖండాలు

మంగినపూడి బీచ్ కళాఖండాలతో నిండిపోయింది. చేపలు, తిమింగలాలు, పీతలతో పాటు డాల్ఫిన్ ఆకృతులు ఏర్పాటు చేశారు. లక్షలాది సందర్శకులు రానున్న నేపథ్యంలో బీచ్‌లో అమరావతి గేట్‌వే ఆకృతిని కళాకారులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

50 మంది సినీ కళాకారులతో నెలరోజులుగా పనులు



వంకా రమణ, ఆర్ట్ డైరెక్టర్

మంగినపూడి బీచ్‌లో నెలరోజులుగా 150 మంది కళాకారులు పనిచేస్తున్నారు. అపురూపమైన కళాఖండాలు తయారుచేశారు. అమరావతి గేట్‌వే పర్యాటకులను ఆకట్టుకుంటుంది. జాతీయస్థాయిలో నిలిచిపోయేలా కార్యక్రమం నిర్వహిస్తున్నాం.



- 2కె రన్‌లో మంత్రి కొల్లు రవీంద్ర
- హాజరైన సినీనటులు నారా లోహిత్, మంచు మనోజ్ తదితరులు



గుర్రాలపై స్వారీ చేస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మసూలా బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా కోనేరుసెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు జరిగిన 2కె రన్‌లో మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో పాటు సినీనటులు నారా రోహిత్, మంచు మనోజ్, డైరెక్టర్ కనకమేడల విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, సినీనటులను తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, మంగినపూడి బీచ్ ఫెస్టివల్ దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించే విధంగా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్, అమరావతికి దగ్గరగా, పర్యాటకులకు అనుకూలంగా ఉండే మంగినపూడి బీచ్‌ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, బీచ్ అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. 2కె రన్‌లో భాగంగా మత్స్యకార కళాకారులతో కలిసి మంత్రి రవీంద్ర ఉత్సాహంగా నృత్యం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని, పాటు మెప్మా పిడి సాయిబాబు, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, మాదివాడ రాము, తలారి సోమశేఖర్, గోపు సత్యనారాయణ, లోగిశెట్టి వెంకటస్వామి, కాగిత వెంకటేశ్వరరావు, పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

- రైతు సేవాసంస్థ అధ్యక్షుడు భవానీ ప్రసాద్

మిగులు జలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మిగులు జలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని రైతు సేవాసంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీ ప్రసాద్ అన్నారు. సోమవారం బనకచర్ల రైతు సంఘాల నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గోదావరి-బనకచర్ల ఎత్తిపోతల పథకం విషయంలో ప్రభుత్వం మంచీ, చెడు ఆలోచించాలన్నారు. చిన్నస్థాయి నీటి పారుదల వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను నిశితంగా పరిశీలించి తమ అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనతో సామాజిక ఉద్యమకారుల సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కృష్ణానదిలో 75శాతం నీటి పంపకం విషయంలో బచావత్ ట్రిబ్యునల్ తీర్పును బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ యథాతథంగా ఆమోదించడంతో రాష్ట్రానికి న్యాయం జరిగినా.. మిగులు జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ హక్కులు ప్రమాదంలో పడ్డాయని, దీనిపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా వాదనలు వినిపించి హక్కులను పరిరక్షించాలని కోరారు. వంశధార నదీ జలాల వివాదంపై ట్రిబ్యునల్ రాష్ట్రానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని, ఈ తీర్పుపై ఒడిస్సా సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందని తెలిపారు. వంశధార సమస్యతో పాటు పొరుగు రాష్ట్రాలతో నీటి వివాదాలు, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణం దృష్టిసారించాలన్నారు. విశ్రాంత ఇంజనీర్ కంభంపాటి పాపారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల పథకంలో భాగంగా పోలవరం నుంచి కృష్ణానదికి నీరు తీసుకురావడం వల్ల ప్రతి సంవత్సరం బుడమేరకు వరద వచ్చే ప్రమాదముందన్నారు. పోలవరం నుంచి తరలించే నీటిని కృష్ణా నదిని దాటించి తీసుకెళ్తే బుడమేరుకు వరద రాకుండా నివారించవచ్చన్నారు. జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందించడం వల్ల భవిష్యత్తులో రాజధాని నగరానికి తాగునీరు అవసరాలకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. పోలవరం ఎత్తుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ప్రస్తావించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోందని, అలాగే పోలవరం నిర్వాసితుల పునరావాసితులకు నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్, కంభపాటి పాపారావు, ఎం.వి.కృష్ణారావు, ఎం.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మీనారాయణ, రాష్ట్ర రైతు సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పనులు చేశాకే..

(5వ పేజీ తరువాయి)

ఆయకట్టు ఉందని, 1,600 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రవహించే ఈ కాలువ వెయ్యి క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కూడా తట్టుకునేస్థితిలో లేదన్నారు. దీంతో ఈ కాలువ ద్వారా సాగునీరు ఎంతమేర పొలాలకు చేరుతుందని ప్రశ్నించారు. బుడమేరుకు ఎనిమిది చోట్ల గండ్లు ఉన్నాయని, ఎప్పటిలోగా పూడుస్తారని నిలదీశారు. గండ్లు పూడ్చడానికి రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారని, ఈ నిధులు ఎప్పటికి విడుదల అవుతాయి, ఎప్పటికి పనులు పూర్తిచేయిస్తారని ప్రశ్నించారు. పనులు చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో ఇస్తామని చెబితే కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు చేయిస్తానన్నారు. బొడ్డపాడు, ఎనికేపాడు, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో తొమ్మిది చోట్ల కాలువలకు గండ్లు ఉన్నాయని, వాటిని పూడ్చేందుకు రూ.3 కోట్లు అవసరమని, పనులు చేసేందుకు నిధులు అందుబాటులో ఉన్నాయా లేవా అన్ని ప్రశ్నించారు.

పామర్రులో పూడిపోయిన ప్రధాన డ్రెయిన్లు

పామర్రు నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్‌లు, పంట కాలువలు ఉన్నాయని, వాటిలో కనీస పూడిక తీత పనులు ఇంతవరకు చేయలేదని పామర్రు ఎమెల్యే వర్ల కుమార్‌రాజా సమావేశం దృష్టికి తెచ్చారు. నియోజకవర్గంలో ఆయకట్టు అధికంగా ఉందని, గుడివాడ, పెడన, అవనిగడ్డ, బందరు నియోజకవర్గాలకు ఈ నియోజకవర్గంలో నుంచే సాగునీరు వెళుతుందని తెలిపారు. కంకిపాడు వద్ద లాకులు శిథిలావస్థకు చేరాయని, వాటికి కనీస మరమ్మతులు చేయాలని కోరారు. ప్రధాన కాలువలకు సంబంధించి రెగ్యులేటర్లు, లాకులు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఏసీబీ వలలో అటవీశాఖ అధికారి

(5వ పేజీ తరువాయి)

రాత్రి ఆనంద్‌పేటలోని జిల్లా అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం టింబర్ డిపో యజమాని రవీంద్రనాథ్‌కు పౌడర్ చల్లిన రూ.18వేల నగదును ఇచ్చి అటవీశాఖ అధికారి వద్దకు పంపారు. నగదు తీసుకున్న అధికారిని ఏసీబీ అధికారులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి నగదును స్వాధీనం చేసుకుని, సంబంధిత అధికారి చేతులను రసాయనాలతో కడిగి లంచం తీసుకున్నట్లుగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఏసీబీ అధికారులకు పట్టుబడిన జి.జయప్రకాష్ 2015లో రాజమండ్రిలో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా పనిచేస్తున్న సమయంలో లంచం తీసుకుని పట్టుబడినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

సాల్ట్ భూములపై కన్ను!

(5వ పేజీ తరువాయి)

పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన బడా వ్యాపారులు చెరువు తవ్వకాలు ప్రారంభించారు. ఆ నాడు 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించి పనులు నిలిపివేశారు. మళ్లీ ఇప్పుడు కొందరు అక్రమార్కులు స్థానికుల సహకారంతో చెరువు తవ్వకాలు చేపట్టారు. దీనిపై సాల్ట్‌శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ నంద కుమార్‌ను వివరణ కోరగా, తవ్వకాల సమాచారం మేరకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. వారు ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకుని పనులు నిలిపివేశారన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఇక ఎలక్ట్రిక్ బస్సులు!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. ట్రిప్పుకు ఐదుగురు సీనియర్ డ్రైవర్ల చొప్పున దశల వారీగా డ్రైవర్లకు శిక్షణ ఇప్పించనున్నారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు సీనియర్ డ్రైవర్లకు హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వనున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు డిపోకు వచ్చిన తర్వాత సీనియర్ డ్రైవర్లు, తమ జూనియర్ డ్రైవర్లకు శిక్షణ ఇస్తారు. ఆర్టీసీకి జూలై నెలలో ఎలక్ట్రిక్ బస్సులు వచ్చే అవకాశం ఉంది. వీటిని సిటీ సబర్బన్ పరిధిలో మైలవరం, కంకిపాడు, గన్నవరం, హనుమాన్‌జంక్షన్ వంటి సబర్బన్ లాంగ్ రూట్లతో పాటు, సిటీ పరిధిలో బందరు రోడ్డు, ఏలూరు రోడ్ల మీద నడపనున్నారు.



మృతుడు ఆంజనేయులు, ప్రమాదానికి గురైన కారు

పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ..

- లారీని ఢీ కొన్న కారు
- ఒకరి మృతి, పలువురికి గాయాలు

ఇబ్రహీంపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వారిలో ఒకరు మృతిచెందగా.. పలువురికి గాయాలైన ఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం కిలేశపురం గ్రామంలో జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల మండలం గుడిపూడి గ్రామానికి చెందిన వెంపరాల ఆంజనేయులు కుటుంబంతో కలిసి పెనుగంచిప్రోలు తిరుపతమ్మను దర్శించుకొని కారులో స్వగ్రామం గుడిపూడికి తిరుగు ప్రయాణయ్యారు. కీలేశపురం గ్రామం వద్దకు చేరుకుంటుండగా డ్రైవర్ వై.ముత్యాలు ఎదురుగా ఉన్న లారీని ఢీ కొట్టాడు. డ్రైవర్ పక్కనే కూర్చున్న వెంపరాల ఆంజనేయులు (45) అక్కడికక్కడే మృతి చెందగా.. వెంపరాల ముత్యాలయ్య (డ్రైవర్), వెంపరాల ఉల్లయ్య, బోగి లక్ష్మి, వెంపరాల నవీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుకున్న వాహనాలు, నిందితులు

నాలుగు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అవనిగడ్డ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు తనిఖీల్లో భాగంగా అవనిగడ్డలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు టన్నుల రేషన్ బియ్యం పట్టుబడింది. నాగాయలంక నుంచి రెండు వాహనాల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావటంతో ఎస్ఐ కె.శ్రీనివాస్ మంగళవారం స్టేషన్ వద్ద, బస్టాండ్ సమీపంలో తనిఖీలు నిర్వహించగా, పెదకళ్లేపల్లిగ్రామానికి చెందిన కూతాడ వెంకన్నకు చెందిన వాహనంలో 2500 కిలోలు, అవనిగడ్డకు చెందిన కోసూరు రాజారావు వాహనంలో 2000 కిలోల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే రౌడీషీట్ ఓపెన్ చేయాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలివ్వగా, ఆ మేరకు వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మహిమాన్విత శైవక్షేత్రం పృధ్వీశ్వరాలయం

- నేడు, రేపు రాజగోపుర వార్షికోత్సవాలు

(ఆంధ్రజ్యోతి - చల్లపల్లి)

కృష్ణాతీరంలో పరమపవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ప్రాచీనమైనది.. మహిమాన్విత శైవక్షేత్రం నడకుదురు పృధ్వీశ్వర ఆలయం. నరకాసుర సంహారవేదికగా, శ్రీకృష్ణుడు, సత్యభామ నడయాడిన ప్రదేశంగా నడకుదురు ప్రాధాన్యతను సంతరించుకుంది. నాటి నరకోత్తారక క్షేత్రం, కాలక్రమేణా నరకొత్తూరు, నరకదూరు, నడకుదురుగా రూపాంతరం చెందిందని చెబుతుంటారు. శ్రీపృధ్వీశ్వరస్వామి స్వయంభువుగా పశ్చిమాభిముఖంగా ఉండటం ఇక్కడి ప్రత్యేకత. దేవలోక వనమాత పాటలీ వృక్షాలు క్షేత్ర చారిత్రక కథనాలకు నిదర్శనాలు. పృధ్వీశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవిని భక్తులు భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. కార్తీకమాసంలో ఆలయాన్ని సందర్శించి ఉసిరిక వనంలో కార్తీక వనసమారాధనలు చేస్తారు.

రాజగోపుర నిర్మాణంతో శోభాయమానంగా



నడకుదురులోని పృధ్వీశ్వరస్వామి ఆలయం



పృధ్వీశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి

చల్లపల్లి మండలం నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త మండవ రవీంద్ర సహకారంతో దేవాలయ రూపురేఖలు మారిపోయాయి. తల్లిదండ్రులు మండవ కృష్ణారావు, సుశీల పేరిట మండవ రవీంద్ర, రమణకుమారి, వారి స్నేహితుడు అల్లూరు మహేష్‌కుమార్‌రెడ్డి రాధిక దంపతులు(నెల్లూరు) రాజగోపుర నిర్మాణం చేపట్టారు. సుమారు రూ.కోటి 30లక్షలు ఆలయ అభివృద్ధికి ఖర్చుచేశారు.



రాజగోపురం, నందీశ్వర మండపం

రాజగోపురాన్ని నిర్మించి, పాటలీవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాల నమూనా దేవతామూర్తులు, పరివార దేవతా విగ్రహాలను ప్రతిష్ఠింపచేశారు.

నేడు, రేపు రాజగోపుర వార్షికోత్సవాలు

బుధ, గురువారాల్లో రాజగోపుర తృతీయ వార్షికోత్సవాలు జరుగనున్నాయి. బుధవారం విశేష పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు, గురువారం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, 121 కలశాలతో అభిషేకం, విశేష పూజలు జరుగున్నాయి. ముఖ్య అతిధిగా ద్విసహస్రావధాని, శతావధాన సామ్రాట్ పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ పాల్గొననున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ వాసు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510	

అభయాంజనేయస్వామి సేవలో రాజ్యసభ సభ్యుడు వెంకట సత్యనారాయణ

హనుమాన్‌జంక్షన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ మంగళవారం స్థానిక అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఢిల్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తన నియోజకవర్గం భీమవరం వెళుతూ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు. స్థానిక కూటమి నాయకులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, గరికపాటి నాగేశ్వరరావు, బెక్కం లక్ష్మీనారాయణ, వడ్డి భార్గవ్ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



నేటి నుంచి పునీత ఆంతోని మహోత్సవాలు

గన్నవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి ఆర్‌సీఎం విచారణలో పునీత అంతోని మహోత్సవం 4 నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్ తెలిపారు. మంగళవారం మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ, ప్రతి రోజు నవదిన ప్రార్థనలు జరుగుతాయని చెప్పారు. చివరిరోజు విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు పాల్గొని దివ్య బలిపూజ సమర్పిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆయా ప్రాంతాల్లో బుధవారం ఉదయం 7నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. అదే విధంగా నందమూరు ఫీడర్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పెదఓగిరాల సబ్‌స్టేషన్ పరిధిలో పెదఓగిరాల, చినఓగిరాల, ఆకునూరులో సరఫరాకు అప్పుడప్పుడూ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఉంగుటూరు : 33/11కేవీ ఉంగుటూరు విద్యుత్ సెక్షన్ పరిధిలోని నందమూరి సబ్‌స్టేషన్ ఏరియాలో ఫీడర్‌లైన్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందమూరు టౌన్, చికినాల, బొకినాల, ఇందుపల్లి, మధిరపాడు, చాగంటిపాడు, వేమండ తదితర గ్రామాల్లో ఐదుగంటలపాటు విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా సైకిల్ దినోత్సవం

ప్రసాదంపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సైక్లింగ్ ప్రధాన పాత్ర పోషిస్తుందని అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రావి రమేష్ అన్నారు. మంగళవారం ఎనికేపాడులోని డెకాథ్లాన్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైకిల్ రైడ్ నిర్వహించారు. అమరావతి రన్నర్స్ డెకాథ్లాన్ నుంచి నగరంలోని పలు ప్రధాన రహదారులు గుండా సైక్లింగ్ చేసుకుంటూ తిరిగి డెకాథ్లాన్ చేరుకున్నారు. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తొలుత డెకాథ్లాన్ మేనేజర్ ప్రణయ్ సైక్లిస్టులందరికీ టీ షర్టులందించారు.



యోగా పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

యోగా పోటీల విజేతలకు బహుమతులు

ఉయ్యూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాసనాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో మొదటి రోజు మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించగా, రెండ రోజు యోగాసనాల పోటీలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానంకు సంబంధించి 18-35 సంవత్సరాల లోపువారికి పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. యోగా సాధకులు జి.కృష్ణ, పీఆర్ ఏఈఈ ఆర్.రాఘవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.వెంకటేశ్వరరెడ్డి, ఏపీఎం అమరేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో పి.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఏలూరుకు చెందిన భక్తులు గంగుల ప్రదీప్‌కుమార్, కవిత దంపతులు అన్నదానం నిర్వహించారు.

తాగునీరు కలుషితం!

- మురుగునీటిలో వాటర్‌వాల్
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు

(కానూరు - ఆంధ్రజ్యోతి)

తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు మెయిన్ రోడ్డులో తాగునీరు కలుషితమువతోంది. పంటకాలువ ప్రాంతం ఆర్టీసీ కాలనీ సమీపంలోని కానూరు మెయిన్‌రోడ్డులో వాటర్‌వాల్ తిప్పే గొయ్యి ప్రాంతంలో మురుగునీరు నిలిచింది. వాటర్ వాల్ ఈ మురుగునీటిలోనే ఉండటంతో వాల్ తిప్పే సమయంలో మురుగునీరు పైపులైన్స్‌లోని వెళ్లి నీరు కలుషితమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు తాగునీరు పంపేందుకు వాటర్‌వాల్‌ను ఉపయోగిస్తారు. నీరు కలుషితమవకుండా ఉండేందుకు వాల్ ప్రాంతంలో సిమెంట్ గచ్చు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది ఇక్కడ కార్యరూపం దాల్చలేదు. తాగునీరు కలుషితం అవుతున్నా తాడిగడప మున్సిపల్ అధికారులు దృష్టి సారించడంలేదని ప్రజలు ఆరో పిస్తున్నారు. ప్రజలు రోగాల భారిన పడకముందే వాటర్‌వాల్ వద్ద గచ్చు నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ దిశగా అధికారులు దృష్టిసారించాలి.



కానూరు మెయిన్ రోడ్డులో మురుగునీటితో నిండిన వాటర్‌వాల్ తిప్పే ప్రాంతం



డివిజన్ల అధ్యక్షులతో మాట్లాడుతున్న వెలగపూడి శంకరబాబు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

పెనమలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): త్వరతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పిలుపునిచ్చారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో తన పరిధిలోని పార్టీ డివిజన్ అధ్యక్షుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. డివిజన్ వారీగా లోటుపాట్లు, ఎప్పటికప్పుడు చేయాల్సిన పనులు, ఓటర్ల నాడి తదితర అంశాలపై చర్చించారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై డివిజన్ల వారీగా అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి ఏవిధంగా ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్నదో వివరించాలని సూచించారు. కార్యక్రమంలో షేక్ బుజ్జి, దోనేపూడి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో శ్రీవారి ఆలయం

నేటి నుంచి శ్రీవారి బహ్మోత్సవాలు

పెనమలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోరంకి లక్ష్మీపురం కాలనీలోని పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి సోమవారం వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించినున్నట్టు ఆలయ అర్చక స్వామి నండూరి మురళీకృష్ణమాచార్యులు, యాజ్ఞిక బ్రహ్మ కొమండూరి చక్రవర్తి ఆచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం స్వామివారికి సుప్రభాత సేవల అనంతరం పెండ్లికూమారుడిని చేయటం. 5న శ్రీమదష్టాక్షరీ మహాయంత్రహవనం. 6న త్రిదండి అష్టాక్షరీసంపత్కుమార రామా నుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీవారికి పంచామృత స్నపన, అష్టోత్తర శతకలశ స్నపన, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం. 7న తిరుకల్యాణోత్సవం, 8న నవపు ష్పార్చన పూర్వక శ్రీపుష్పయాగం, అఖండ అన్నసమారాధన, రాత్రి సహస్ర దీపాలంకరణ. 9న మహాపూర్ణాహుతి, వసంతోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.

పోలీసులపై వస్తున్న వార్తలు అవాస్తవం

గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు

పెనమలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోరంకిలో ఏప్రిల్‌లో జరిగిన మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడు ఎండ చందు తండ్రి ఆత్మహత్య చేసుకొని మరణించిన ఘటనలో పోలీసుల ప్రమేయమేమీ లేదని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పెనమలూరు పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడు చందుతో పాటు మైనర్ బాలిక కనిపించకపోవడంతో అతని తల్లిదండ్రులను పోలీసులు వేధించారని, అందుకే చందు తండ్రి మోహన్‌రావు ఆత్మహత్య చేసుకొన్నాడని ఒక ఛానెల్‌లో వస్తున్న వార్తలు సత్యదూరమని, కేసు దర్యాప్తును దెబ్బతీసేలా ప్రభావితం చేసే సమాచారాన్ని ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. చందు కుటుంబ సభ్యులు ఇరవై ఏళ్లుగా పోరంకిలో నివాసముంటున్నారని, ఈక్రమంలో చందు మైనర్‌బాలికను కిడ్నాప్ చేసి తనతో పాటు కొంత బంగారాన్ని కూడా తీసుకెళ్లాడని తెలిపారు. విచారణలో భాగంగా మైనర్ బాలిక తల్లిదండ్రులను శ్రీకాకుళం టౌన్ గుజరాతీపేటకు తీసుకెళ్లామని తెలిపారు. కేసులో సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టగా చందు బాలికను విజయనగరం జిల్లా రాజాం తీసుకెళ్లాడని, అక్కడ అతని తల్లి రేణుక వారిని ఒక లాడ్జి రూంలో మూడు రోజులు ఉంచిందని తెలిపారు. వారు తీసుకెళ్లిన నగలును శ్రీకాకుళంలోని ఒక షాపులో రేణుక అమ్మి ఆ డబ్బును చందుకు ఇచ్చినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ వెంకటరమణ పాల్గొన్నారు.

లౌకిక శక్తులను కూడగట్టాలి : సీపీఎం

హనుమాన్‌జంక్షన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో పెరుగుతున్న మతోన్మాద దాడులకు నిరసనగా లౌకిక శక్తులను కూడగట్టి ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. సీపీఎం కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో జంక్షన్‌లో మూడు రోజులు పాటు నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నయా పాసిస్టు లక్షణాలు కలి గిన బీజేపీ ప్రభుత్వాన్ని రాష్ట్ర కూటమి ప్రభుత్వం సమర్థించడం దుర్మార్గమ న్నారు. ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా బీజేపీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తుందని విమర్శించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, నాయకులు శీలం నారాయణ, బేత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సాగునీటి సమస్యలను వివరిస్తున్న కాకులపాడు డీసీ చైర్మన్ రాజేష్

ఏలూరు కాలువ నీటి నిర్వహణ సామర్థ్యం పెంచాలి

కలెక్టర్‌కు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ వినతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేలాది ఎకరాలకు సాగునీరు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీరు అందించే ఏలూరు కాలువకు సత్వరం నిర్వహణ పనులు చేపట్టి నీటి నిర్వహణ సామర్థ్యం పెంచేలా తగు చర్యలు చేపట్టాలని కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ కలెక్టర్ డి.కె.బాలా జీకి విన్నవించారు. మచిలీపట్నంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఆయుకట్టుదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ బాలాజీ సానుకూలంగా స్పందించి రైతులకు సాగునీటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపడతామని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో హామీ ఇచ్చారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

దళితులపై జగన్‌రెడ్డిది కపట ప్రేమ: టీడీపీ

హనుమాన్ జంక్షన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నపుడు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి దళితులు పట్ల చూపిన కపట ప్రేమ తెనాలి ఘనటతో మరో మారు బయటపడిందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు విమర్శించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్ఎస్పీ ఎడమ కాలువ వీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణారావుతో కలిసి రాజేశ్వరరావు మీడియా మాట్లాడుతూ, వైఎస్ జగన్‌రెడ్డి పాలనలో దళితులు ఎదుర్కొన్న అవమానాలు, దాడులు, అన్యాయాలు ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. సమావేశంలో టీడీపీ మండల కార్యదర్శి పుట్టా సురేశ్, జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కోట్లాది రూపాయల కుంభకో ణాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ధర్నా డ్రామాలు ఆడుతున్నారని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి విమర్శించారు. హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆస్తికోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసిన జగన్ కుటుంబ వ్యవస్థకు వెన్నుపోటు పొడిచారన్నారు.

పెనమలూరు : రౌడీషీటర్లను పరామర్శించడానికి జగన్ వెళ్లడం అతని సైకో మనస్తత్వాన్ని చెప్పకనే చెప్పిందని, ఇది అతని పిచ్చికి పరాకాష్ట అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు జగన్ తీరుపై ధ్వజమెత్తారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పీతా గోపీచంద్, శొంఠి శివరాంప్రసాద్, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి మాట్లాడుతూ, వెన్నుపోటు, గొడ్డలిపోటు రాజకీయాలు జగన్ ఇంట్లోనే పుట్టాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ పెనమలూరు అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, కంకిపాడు అధ్యక్షుడు సూదిమళ్ల రవీంద్ర, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, సంగెపు రంగారావు, తుమ్మల రాంకుమార్, బోడె సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

ఉయ్యూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగు లు, వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ సరుకులను డీలర్లు అందజేస్తున్నారని తహసీల్దార్ ఎం.సురేశ్ కుమార్ తెలిపారు. కడవకొల్లు, కాటూరు గ్రామాల్లో రేషన్ షాపులవద్ద సరుకుల పంపిణి, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే సరుకుల పంపిణీని మంగళవారం తనిఖీ చేశారు.



జేఈఈ ఫలితాల్లో సత్తా చాటిన నారాయణ, శ్రీచైతన్య

పెనమలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయవాడ నారాయణ కళాశాలల విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 3, 4, 6, 7, 10 వంటి పదిలోపు ఐదు ర్యాంకులతో విజయదుందుభి మోగించినట్లు సంస్థ డీజీఎం జాగర్లమూడి రవిశంకర్, కోర్ డీన్ గుడ్లవల్లేటి శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో విజేతలు, వారి తల్లిదండ్రులతో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డీన్ శ్రీరాం చంద్ చౌదరి, ఏజీఎం రాజశేఖర్‌బాబు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో విజేతలతో డీజీఎం, కోర్ డీన్, డీన్‌లు

శ్రీచైతన్య విద్యాసంస్థల విజయోత్సవ ర్యాలీ

కానూరు: జేఈఈ- అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతం ఎగరవేసినందుకు గాను మంగళ వారం శ్రీచైతన్య విద్యాసంస్థల విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మి జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణతో పాటు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.



జేఈఈ ర్యాంకర్ హారికకు అభినందన

ఉయ్యూరు : జేఈఈ అడ్వాన్స్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 1071, ఓబీసీ కోటాలో 176 ర్యాంకు సాధించిన తుమ్మలచర్ల హారికను శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల యాజమాన్యం మంగళవారం అభినందించి, ఘనంగా సత్కరించారు. విశ్వశాంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ మాదల సుబ్రమణ్యేశ్వరరావు, డైరెక్టర్ సూర్యశేఖర్, ఇతర డైరెక్టర్లు, అధ్యాపకులు, సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



సమస్యలను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తా

● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ● నెలరోజుల్లో గుణదల ఆర్‌వోబీ పనులు ప్రారంభం ● ఆరు ఆర్‌యూబీలు, మూడు ఆర్‌వోబీలకు ప్రతిపాదనలు చేశాం : ఎమ్మెల్యే


సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని రైల్వే సమస్యల పరిష్కారం, ఆర్‌వోబీ నిర్మాణాలకున్న అవాంతరాలను పరిశీలించిన ఎంపి కేశినేని (చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమా

గుణదల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సింగ్‌నగర్, సత్యన్నారాయణ పురం,మధురానగర్, గుణదల ప్రాంతవాసులు రైల్వేట్రాక్‌లు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆయా సమస్యలను కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంపరిధిలోని రైల్వే సమస్యలను ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుణదల ఉలవచారు కంపెనీ వద్ద నిలిచిపోయిన ఆర్‌వోబీ పనులను పరిశీలించారు. తర్వాత సత్యన్నారాయణపురం, మధురానగర్, దేవినగర్, సింగ్‌నగర్ ప్రాంతవాసులు రైల్వేట్రాక్‌లు దాటేందుకు పడుతున్న అవస్థలను స్వయంగా పరిశీలించారు. స్థానికులు ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి రైల్వే సమస్యలను వినతిపత్రం రూపంలో వారికి సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ సెంట్రల్‌లోని పలు ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 15 రోజుల్లో ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను రైల్వే బోర్డ్ ఛైర్మన్‌ను కలిసి ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలను మంజూరు చేయాల్సిందిగా కోరతానన్నారు. రేపు జరగబోయే డీఆర్‌ఎం మీటింగ్‌లో సెంట్రల్‌లో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను చర్చకు తీసుకొచ్చి పరిష్కరించేలా చేస్తానన్నారు. సింగ్‌నగర్లో పెరిగిన ట్రాఫిక్ రీత్యా రెండో ఫ్లై ఓవర్ అవసరమన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వేశాఖతో ముడిఉండటంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలోనే సీఎం చంద్రబాబుతో పాటు రైల్వే అధికారుల దృష్టికి ఇక్కడ 6 ఆర్‌యూబీలు, 3 ఆర్‌వోబీల అవసరాన్ని తెలియజేస్తూ ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ఆగిపోయిన రైల్వే పెండింగ్ పనులు మొదలుపెట్టడంపై దృష్టి పెట్టిందనేన్నారు. నెలరోజుల్లో గుణదల్లో నిలిచిపోయిన ఆర్‌వోబీ పనులు ప్రారంభిస్తామన్నారు. ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ గొట్టుముక్కల రఘురామ రాజు, ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.

మోడల్ కలెక్టరేట్‌గా తీర్చిదిద్దుదాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


పచ్చదనం పరిశుభ్రతపై కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకమైన సేవలందించడంతో పాటు పరిపాలన, పచ్చదనం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను మోడల్ కలెక్టరేట్‌గా తీర్చిదిద్దడంలో అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో చేపట్టాల్సిన సంస్కరణలు, ప్రాంగణం అభివృద్ధి, పచ్చదనం పరిశుభ్రతపై మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురాతన కాలం నాటి కట్టడమైన కలెక్టరేట్ భవనం సందర్శకులను ఎంతో ఆకట్టుకొంటోందన్నారు. ఒకప్పటి సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పడి నూరు వసంతాలు పూర్తిచేసుకొన్న సందర్భంగా ఏర్పాటు చేసిన స్థూపం సమాచారాన్ని ప్రజలకు తెలియజేసేలా రంగులతో తీర్చిదిద్ది అలంకరించాలన్నారు. స్థూపం చుట్టూ ఔషధ మొక్కలు నాటి, సంరక్షించి, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్‌ను సందర్శించే ప్రజలకు అర్థమయ్యేలా విభాగాలు, అధిపతులకు దారిచూపుతూ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన ద్వారం వద్ద కలెక్టరేట్‌కు సంబంధించిన లే అవుట్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ వాడకుండా చూడాలన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు

జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. గోవధ నిషేధ చట్టం అమలుపై సమన్వయ శాఖల అధికారులతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7న బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని ఉల్లంఘించకుండా ఆహ్లాదకర వాతావరణంలో పండుగ జరుపుకోవాలని జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘనలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ఆదేశించారు. గోవధ నిషేధ చట్టం అమలు వంటి విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల, డివిజన్ స్థాయిలోని విజిలెన్స్ కమిటీలు చట్టం అమలును పర్యవేక్షించాలన్నారు. జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డీపీవో పి.లావణ్యకుమారి, గో సంరక్షణ సమితి ఐకాస సభ్యులు తోట సురేష్, నాగలింగం శివాజీ, పోతురాజు వినోద్‌రాజ్ పురోహిత్, గోవిందసాబు, మిరియాల శ్రీనివాసరావు, బాలకృష్ణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చిక్కిన స్నాచర్లు!

● నిందితుల్లో రౌడీషీటర్, విద్యార్థి ● పరారీలో మరో ఇద్దరు

● నున్నప్రాంత యువకులుగా గుర్తింపు ● గొలుసు చోరీలకు ముందు బైక్ చోరీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: 10 నిమిషాల వ్యవధిలో రెండు వేర్వేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గొలుసు చోరీలు చేసిన నిందితులను పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల్లో కనిపించిన ఈ ఇద్దరు యువకులు విజయవాడ నున్న ప్రాంతానికి చెందిన వారని ఒక నిర్ధారణకు వచ్చారు. సోమవారం రాత్రి ఆటోనగర్‌లోని సన్‌లైట్ సెంటర్‌లో నడిచి వెళ్తున్న ఓ మహిళ, పాలీక్లినిక్ రోడ్డులో మున్సిపల్ కాలనీలో ఓ కిరణా షాపులోని మహిళ మెడలో ఉన్న బంగారం గొలుసులను లాగేసిన విషయం తెలిసిందే. మొదట ఘటన జరిగిన సన్‌లైట్ సెంటర్ నుంచి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ రెండు గొలుసు చోరీలను చేయడానికి ముందు బైక్‌లను దొంగిలించినట్టు సమాచారం. మొత్తం నలుగురు యువకులు గ్యాంగ్‌గా ఏర్పడి ఈ చోరీలు చేసినట్టు తెలిసింది. నున్న ప్రాంతానికి నలుగురు యువకులు ఈనెల 1న అర్ధరాత్రి యాక్టివా, పల్సర్ బైక్‌పై బయలుదేరి విజయవాడకు చేరుకున్నారు. ముందుగా మొగల్రాజపురంలోని బోయపాటి మాధవరావు వీధిలో ఓ ఇంటి ముందు ఉన్న యమహా ఎంటీ 15 బైక్ దొంగిలించారు. దీన్ని తీసుకుని నున్నకు వెళ్లిపోయారు. అక్కడ బైక్‌కు ఉన్న నంబరు ప్లేటును తొలగించారు. ఆ బైక్‌ను ఉపయోగించుకుని ఆటోనగర్, మున్సిపల్ కాలనీలో చైన్ స్నాచింగ్‌లు చేశారు. ఈ నలుగురి గ్యాంగ్‌లో ఇద్దరిని పోలీసులు గుర్తించినట్టు విశ్వసనీయంగా తెలిసిందే. ఆ ఇద్దరిలో సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్, మరో విద్యార్థి ఉన్నట్టు తెలిసింది. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం రాత్రి రెండు గొలుసు చోరీలు జరిగాయని పోలీసులు భావించారు. వాస్తవానికి ఈ గ్యాంగ్ మూడు స్నాచింగ్‌లు చేసింది. సోమవారం సత్యనారాయణపురం పోలీసులు కొత్త పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవ హడావుడిలో ఉన్నారు. దీన్ని గమనించిన యువకులు శారదా కళాశాల వద్ద ఓ మహిళ మెడలో ఉన్న గొలుసును లాక్కున్నట్టు సమాచారం. ఈ గొలుసు రోల్డ్‌గోల్డ్ అని తెలిసింది. ఈ స్నాచింగ్‌ను ఉదయమే చేసినట్టు భావిస్తున్నారు. తర్వాత ఇళ్లకు వెళ్లిపోయిన ఈ యువకులు రాత్రికి మళ్లీ రోడ్డెక్కారు. ఈసారి ఆటోనగర్, మున్సిపల్ కాలనీ ప్రాంతాలను టార్గెట్ చేసుకుని గొలుసు చోరీలు చేశారు. గ్యాంగ్‌లో ఇద్దరి ఆచూకీ లభించినందుకు మిగిలిన ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

పదోన్నతుల ఉత్తర్వులు ఇవ్వాలని ధర్నా

మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రమోషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించి 39 రోజులైనా ఇంతవరకు ఉత్తర్వులు జారీ చేయలేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారిపోయామని డీఎంహెచ్‌వో తక్షణమే స్పందించాలంటూ మంగళవారం రాత్రి ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించారు. ఏఎన్‌ఎం 2 నుంచి ఏఎన్‌ఎం1కు పదోన్నతులపై 39 రోజుల క్రితం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఏ ఫిమేల్ వర్కర్లకు 270 మందికి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. 39 రోజులు గడిచినా పదోన్నతుల ఉత్తర్వులివ్వకపోవడంతో ఏఎన్‌ఎంలు ఉద్యమానికి దిగారు. ఏఎన్‌ఎంలు ఉద్యమం జరుగుతున్న సమయంలో డీఎంహెచ్‌వో కలెక్టర్‌తో మాట్లాడి ఉత్తర్వులిస్తామంటూ వెళ్ళిపోయారు. కలెక్టర్ చెప్పినప్పటికీ ఉత్తర్వులు ఇవ్వడం లేదంటూ ఏఎన్‌ఎంలు ఆందోళన చేశారు.


డీఎంహెచ్‌వో ఆఫీసు వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు


ఇంటి ఆవరణలో తవ్విన టైప్ - 2 గుంతలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

17వేల గుంతల తవ్వకమే లక్ష్యం

● సేంద్రియ ఎరువుల గుంతలతో బహుళ ప్రయోజనం
● పెరట్లో, ఖాళీ స్థలాల్లో, పశువుల షెడ్ల వద్ద గుంతల ఏర్పాటు
● కుళ్ల బెట్టే వ్యర్థాలు పొలాల్లో ఎరువులుగా

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: పారిశుధ్య సమస్యకు చెక్ పెట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం వినూత్న పద్ధతిని తీసుకొచ్చింది. అదే బహుళ ప్రయోజనాల సేంద్రియ ఎరువుల తయారీ గుంతల తవ్వకునే పథకం. ఈ పథకంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో ఏకంగా 17 వేల గుంతలను తవ్వి వర్మీ కంపోస్టు తయారు చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పొలాల్లో రసాయన ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగం పెంచే క్రమంలో ఇలాంటి గుంతలు తీయిస్తున్నారు. టైప్-1, టైప్-2గా గుంతలను విడదీసి ఒక రకం ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో, రెండోరకం పశువులు షెడ్ల వద్ద తీసుకునేలా చర్యలు చేపట్టారు. వీటి తవ్వకం కోసం ఉపాధి హామీ పనిదినాలను కేటాయిస్తున్నారు.

ఇంటి వద్ద కంపోస్టు పిట్ తయారీ

7 అడుగుల వెడల్పు, 7 అడుగుల పొడవు, ఒక మీటర్ వ్యాసార్థంలో మూడడుగుల గుంతను తవ్వుకొని మట్టిని ఒక అడుగు వదిలి చుట్టూ గట్టుగా వేయాలి. ఒక గుంతకు ఒక రోజు పని దినం, రెండు గుంతలకు రెండు రోజులు పని దినాలు కేటాయిస్తారు. ప్రతిరోజు వంట గది నుంచి వచ్చే కూరగాయల, ఇతర వ్యర్థాలు, కుళ్లే స్వభావం ఉన్న వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు తప్ప ప్రతి వస్తువులను గుంతల్లో వేసి వర్మీ కంపోస్టుగా తయారు చేసుకొని పెరట్లో మొక్కలు వినియోగించుకోవచ్చు. మొక్కలకు సేంద్రియ ఎరువు అందించుకోవచ్చు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయాలు పండించుకునే అవకాశం ఉంటుంది. దీంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవచ్చు.

పశువుల షెడ్ వద్ద కంపోస్టు పిట్ తయారీ

4 మీటర్ల - 4 మీటర్ల వైశాల్యం గల స్థలంలో 1.5 మీటర్లు పొడవు, 1.5 మీటర్ల వెడల్పు, 3 అడుగుల లోతు గుంతలకు తీసుకోవాలి. తవ్విన మట్టిన గుంత చుట్టూ అర మీటర్ వదిలి గట్టు కట్టుకోవాలి. 2.5 అడుగుల వెడల్పు కట్ట నిర్మాణం చేయాలి. కట్టపైన వెడల్పు ఒక అడుగు ఉండేలా వాలుగా చేయాలి. గుంతకు మూడు పని దినాలు, రెండు గుంతలకు 6 పనిదినాలు కేటాయిస్తారు. పశువుల పేడను ఆ గుంతల్లో వేసుకొని కంపోస్టుగా మార్చవచ్చు. దీంతో పారిశుధ్యం మెరుగుపడటమే కాకుండా దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయి.

పెద్ద ఎత్తున అవగాహన

ఈ రెండు రకాల గుంతలు తవ్వకునేలా, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ తెలిసేలా డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించి ప్రజలకు వాటి ప్రయోజనాలు వివరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.


వారంలో పనులు ప్రారంభం కావాలి: కలెక్టర్

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెవుటూరులో సేంద్రియ ఎరువుల గుంతల పనుల్ని ప్రారంభించి అక్కడ తీసిన గుంతలను పరిశీలించి మాట్లాడుతూ వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

అధికారం కోసం కుయుక్తులు

● వైఎస్ జగన్‌పై ఐపీఎస్ మాజీ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విమర్శలు
● థర్డ్ డిగ్రీ ప్రయోగించి నేరం ఒప్పించాలని చూశారు
● జగన్ చర్యలతో ఆర్థికంగా చితికిపోయిన వడ్డెర కుటుంబాలు
● తప్పుడు కేసులు పెట్టిన అధికారులు, పెట్టించిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
● లోకేశ్, బొండా ఉమా పేర్లు చెప్పమని చిత్రహింసలు పెట్టారన్న బాధితులు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గులకరాయి డ్రామాలు తెరపైకి తెచ్చి పేదలను బలిచేసి తద్వారా సానుభూతి పొంది అధికారంలోకి రావాలని ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుయుక్తులు పన్నారని మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. జగన్ గులకరాయి కేసులో నిందితులుగా ఉన్న అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీ ప్రాంతానికి చెందిన వేముల దుర్గారావు, వేముల సతీష్, డేరంగుల సంతోష్ అలియాస్ చిన్నా, వేముల సతీష్ కుటుంబాలను మంగళవారం న్యాయవాది సలీంతో కలిసి ఏబీ వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా గులకరాయి కేసులో నిందితులుగా ఉన్న యువకులతో మాట్లాడి నాడు ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. దీంతో యువకులు వారి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ గత ప్రభుత్వం కారణంగా తాముపడ్డ నరకాన్ని వివరించారు. స్థానిక కార్పొరేటర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డి రూ.200 ఇస్తామంటే తాము జగన్ పర్యటనకు వెళ్లి వచ్చామని అంతకు మించి ఏ పాపం తెలియదన్నారు. రెండు రోజుల తర్వాత పోలీసులు వచ్చి గంజాయి తాగుతున్నారని, కౌన్సెలింగ్ ఇస్తామని ఇంటి నుంచి స్టేషన్‌కు తీసుకెళ్లారని, అక్కడికి వెళ్లాక జగన్‌పై రాళ్లు వేసింది తామేనని ఒప్పుకోవాలని పోలీసులు చేశారన్నారు. ఇందులో భాగంగా అప్పుడే తెలుగుదేశం పార్టీలో చేరి చురుగ్గా పనిచేస్తున్న వేముల దుర్గారావు పేరు చెప్పమన్నారని తెలిపారు. తామెలా చెబుతామని ప్రశ్నించగా ఐదు రోజులపాటు చిత్రహింసలు పెట్టారన్నారు. చివరకు బలవంతంగా వేముల దుర్గారావు పేరు చెప్పించారని, అనంతరం అతడిని కూడా పిలిపించి రహస్యంగా చిత్రహింసలు పెట్టారన్నారు. అనంతరం దుర్గారావు తనపై జరిగిన దాష్టికాన్ని ఏబీ వెంకటేశ్వరరావుకు వివరించాడు. ఇష్టానుసారంగా తనను చావబాది అప్పటి ప్రతిపక్ష నేతలు లోకేశ్, బొండా ఉమా పేర్లు చెప్పాలని, అందుకు రూ.2లక్షల నగదుతో పాటు వైసీపీలో పదవి ఇస్తామని, లేకుంటే కుటుంబ సభ్యులను కాల్చి చంపేస్తామని బెదిరించారన్నారు. దీని వెనుక ఎమ్మెల్సీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డి ఉన్నారన్నారు. అనంతరం ఏబీ వెంకటేశ్వరరావు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఈ ఘటనలను పరిశీలిస్తే ఎన్నికల్లో గెలిచేందుకు జగన్, వైసీపీ నేతలు భారీ స్కెచ్ వేసినట్టు తెలుస్తోందన్నారు. ఇందుకు ఆర్థికంగా భరోసా లేని వడ్డెర కుటుంబాలను ఎంపిక చేసినట్టు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఓ ఎన్నికల్లో కోడి కత్తి డ్రామా ఆడి సానుభూతి పొందేందుకు శ్రీనును బలిచేశారని, తర్వాత ఎన్నికల్లో సొంత బాబాయిని చంపించి సానుభూతి పొందారని, గత ఎన్నికల్లో కోసం పేద కుటుంబాలను బలిచేశారని దుయ్యబట్టారు. ఏడాది గడుస్తున్నా బాధితులు స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, వారికి న్యాయం జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ రుహుల్లా, ఆ పార్టీ నేత అవుతు శ్రీనివాసరెడ్డి, అప్పటి సీపీ, పోలీసు అధికారులు బాధ్యత వహించాలన్నారు. బాధితులకు నష్టపరిహారం అంది కేసుల నుంచి విముక్తి పొందేవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలతో నగర పోలీసు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.


పోలీసు దెబ్బల తాలూకు గాయాలను చూపుతున్న బాధితులు


అలంకార్ థియేటర్‌లో మాట్లాడుతున్న మనోజ్, నారా రోహిత్

'భైరవం' హీరో ద్వయం సందడి

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 'విజయాలవాడ బెజవాడ.. ఎన్నో ఏళ్ల తరువాత మళ్లీ మీ ముందుకొచ్చా. అందరూ బాగున్నారా' అంటూ భైరవం హీరో మంచు మనోజ్ అభిమానులను ఉత్సాహపరిచాడు. మంగళవారం నగరంలో అలంకార్ థియేటర్‌లో భైరవం విజయోత్సవంలో చిత్ర యూనిట్ సందడి చేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ సినిమాల విషయంలో ఇక ఆగడం ఉండదన్నారు. తన సినిమాలు వరుసగా వస్తూనే ఉంటాయన్నారు. తమ హీరో రోహిత్ సుందరకాండ జూలైలో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా రెండు వారాల్లో విడుదల కాబోతోన్నాయని అప్పటి వరకు భైరవం సినిమా ఆడుతూనే ఉండాలని ఆకాంక్షించారు. తన సహచర నటుడు నారా రోహిత్ నటించిన సుందరకాండ సినిమా కూడా కుటుంబంతో చూడదగ్గ చిత్రమన్నారు. నటుడు నారా రోహిత్, విజయ్ కనకమేడల, చిత్ర నిర్మాత కే కే రాధా మోహన్, అన్నపూర్ణ స్టూడియోస్ మేనేజర్ కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బద్మాషులు చిత్ర బృందం

నగరంలో 'బద్మాషులు'

లబ్బీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో బద్మాషులు చిత్ర యూనిట్ సందడి చేసింది. మంగళవారం మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చిత్ర నటీనటులు విద్యాసాగర్, దీక్ష మాట్లాడుతూ పూర్తి గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మించామని, ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందన్నారు. దర్శకుడు శంకర్ చేకూరి నూతన నటీనటులతో అద్భుతంగా తీశారన్నారు. ఈ నెల 6న ఈ సినిమా విడుదల కానుందన్నారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చిత్ర దర్శకుడు శంకర్ చేకూరి మాట్లాడుతూ ఈ చిత్రం టైటిల్‌కు ప్రేక్షకులు నుంచి విశేష స్పందన వచ్చిందని, చిత్రంలో కామెడీ, ప్రేమ సన్నివేశాలు కడుపుబ్బ నవ్వించేలా తీశామన్నారు.

ముచ్చెర్ల శ్రీనివాసరావు మా సభ్యుడు కాదు

● లబ్బీపేట వేంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బంగారం చిట్టీలు నిర్వహించి ప్రజలకు కుచ్చుటోపీ పెట్టిన ముచ్చెర్ల శ్రీనివాసరావు తమ కమిటీ సభ్యుడు కాదని కంచి కామకోటి పీఠస్థ శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థాన పాలక మండలి పర్సన్ ఇన్‌చార్జి రామమోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరావుకు పాలక మండలితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దేవస్థానాలను పాలక మండలి నిర్వహిస్తోందన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నెట్టెం, శ్రీరాం తాతయ్య

వెన్నుపోటు సంస్కృతి జగన్‌దే

● టీడీపీ నేత నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే తాతయ్య ధ్వజం

జగ్గయ్యపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నవరత్నాలు పేరుతో నవ మోసాలు చేసి ప్రజలు చీత్కరించినా జగన్‌రెడ్డి నైజం మారలేదని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ధ్వజమెత్తారు. వారివురు నెట్టెం నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు వెన్నుపోటు దినోత్సవం పేరుతో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం జగన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణం సహా అనేక కుంభకోణాల్లో జగన్ ప్రమేయం బయటపడుతున్నాయని, వెన్నుపోటు అనేది జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంత్సరంలోపే 70శాతం హామీలు నెరవేర్చిందన్నారు. పింఛన్ పంపిణీ, ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం, మెగా డీఎస్సీ, చెత్తపన్ను ఎత్తివేత, అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభంతో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు మేకా వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, ముల్లంగి రామకృష్ణారెడ్డి, మల్లెల గాంధీ, టీ జగన్మోహనరావు, నరసరాజు, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.


అగ్నికి ఆహుతైన పాత ఇనుము, ప్లైవుడ్ పరికరాలు, బాధితులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

భారీగా ఆస్తినష్టం ● బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

నందిగామ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల భవనంలో మంటలు చెలరేగి భారీ ఆస్తినష్టం సంభవించింది. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల రోడ్డులోని మూడంతస్తుల భవనంలో తమ్మిశెట్టి యల్లమందయ్య నివాసంలోని కిందభాగంలో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. పాత ఇనుప వ్యాపారం చేసే యల్లమందయ్య కొనుగోలు చేసిన పాత ఇనుప సామాను సహా ప్లైవుడ్ చెక్కలను నిల్వ ఉంచాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి కిందిభాగంలో మంటలు రావడంతో పాటు ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనుమానం వచ్చిన యల్లమందయ్య కిందకు వచ్చి చూడగానే మంటలు ఎగసిపడడం గమనించి భార్య, పిల్లలను బయటకు తీసుకువచ్చి ఫైర్ సిబ్బందికి సహాచారం ఇచ్చాడు. దీంతో నందిగామ, కంచికచర్ల స్టేషన్లకు చెందిన అగ్నిమాపక వాహనాలు హుటాహుటీన అక్కడకు చేర్చి మంటలు అదుపు చేశారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మునిసిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, టీడీపీ పట్టణాధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ, న్యాయవాది షేక్ కరీముల్లా ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సౌమ్య అధికారులను ఆదేశించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

పారదర్శకంగా వార్డెన్ల బదిలీలు


మాట్లాడుతున్న రమేష్

పామర్రు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అవినీతికి తావులేకుండా బీసీ సంక్షేమశాఖలో పూర్తి పారదర్శకంగా వార్డెన్ల బదిలీలు చేపడుతున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత డిప్యూటీ డైరెక్టర్, పామర్రు నియోజకవర్గ ఎన్నికల ఎలక్ట్రోరల్ అధికారి జి. రమేష్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవోఎంఎస్ 23 మేరకు వసతిగృహాల సంక్షేమ అధికారుల బదిలీలకు సంబంధించిన వివరాలను గతనెల 30న జిల్లా కలెక్టర్‌కు పంపించామన్నారు. వార్డెన్ల బదిలీల కోసం ఐదేళ్లు పూర్తిచేసుకున్నవారు అర్హతలు పరిశీలించుకునే నిమిత్తమే జిల్లా కార్యాలయానికి వార్డెన్లు హాజరైనరైనట్టు చెప్పారు.

విద్యుత్ కోతలను సహించేది లేదు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడితే సహించేది లేదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో విద్యుత్ కోతలు, టిడ్కో కాలనీలో విద్యుత్ సమస్యలు, వివిధ అంశాలపై అధికారులపై ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రశ్నలను సంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో విద్యుత్ శాఖ పనితీరు అధ్వానంగా ఉందని, ఇకనైన తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో సక్రమంగా విద్యుత్ సరఫరా, గ్రామాల్లో విద్యుత్ లైన్ల సమస్యలు, టిడ్కో కాలనీలో విద్యుత్ దీపాల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ పనులన్నీ వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఉద్యోగులంటే తనకు గౌరవమని, కానీ ప్రజలకు ఇబ్బందులు వస్తే మాత్రం తాను అధికారులను ప్రశ్నిస్తానన్నారు. అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, టీడీపీ నాయకులు లింగం ప్రసాద్, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావు, ఏడీఏలు కె.వర్మ, కిరణ్‌బాబు, ఏఈలు సూర్యప్రకాష్, బ్రహ్మానందం, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల సత్వర పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. కొమరవోలులోని మేజర్‌డ్రెయిన్ పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకాల్వల పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం వహించేవారిని సహించేదిలేదని సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామాల్లోని డ్రెయిన్లలో పూడికతీత పనులు ఎక్స్‌కవేటర్‌తో ప్రారంభిచడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. పామర్రు డీసీ కొనరాజు వేంకటేశ్వరరావు, సాగునీటి సంఘ అధ్యక్షుడు ప్రసాద్, కొమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, వేణు, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : తక్కువపెట్టుడితో అధిక దిగుబడులు వచ్చేలా రైతులకు సూచనలు, సలహాలతో వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని


రైతులకు స్ప్రేయర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. తాడంకి చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త, జి ల్లా నోడల్ అధికారి డి.సుధారాణి, జిల్లా అధికారి మనోహరరావు , గన్నవరం ఏడీఏ సునీల్ , సర్పంచ్ జంపాన దనలక్ష్మి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతిరమణి, ఏడీఏ శ్రీనివాస్, ఆయిల్ పామ్ శాస్త్రవేత్త అనిత పాల్గొన్నారు.

మొవ్వ కళాశాలను అగ్రగామిగా నిలిపేందుకు కృషి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలను రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రిన్సిపల్, అధ్యాపకులు కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తోపాటు కళాశాల అధ్యాపకులు పామర్రులోని ఆయన కార్యాలయంలో వర్ల కుమార్ రాజాను మర్యాదపూర్వకంగా కలసి ఆయనను సత్కరించారు. మొవ్వ కళాశాలకు రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉందని, దానిని నిలబెడుతూ మరిన్ని మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని తెలిపారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు శ్రీనివాసరావు, వాసుబాబు, ఆనంద్ నారాయణ, విజయభేరి, మోహన్ తదితరులు ఎమ్మెల్యేను కలసిన వారిలో ఉన్నారు.

క్షేత్రయ్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ

కూచిపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డి.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. తణుకులోని చిట్టూరి ఇందిరయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పని చేస్తూ పదోన్నతిపై మొవ్వ కళాశాలకు బదిలీ అయ్యారు. 2025-26 విద్యాసంవత్సరానికి గానూ ఇంటర్ ప్రథమ సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నట్టు ప్రిన్సిపల్ తెలియజేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి వారి సర్టిఫికెట్లతో హాజరై కళాశాలలో సీట్లు పొందాల్సిందిగా ఆయన కోరారు.

అడ్మిషన్స్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

గుడివాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వెంకటరత్నం (ఎస్‌కేపీవీవీ) హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకు సంబంధించి మంగళవారం స్థానిక గౌరీశంకరపురంలోని పీఎస్‌సీయమ్‌ఆర్ అడ్మిషన్లు, కౌన్సెలింగ్ సెంటర్‌ను అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) ప్రారంభించారు. కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సీఏ చిట్లూరి అమర్ సుధీర్ మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్లు, కౌన్సెలింగ్ కోర్సుల సమాచారం, స్కాలర్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ అవకాశాలపై పూర్తి అవగాహన పొందుతున్నారన్నారు. ఈ


కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పూర్ణవీరయ్య

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్, ఎల్ఈపీఎల్ కంపెనీ కార్యదర్శి సీహెచ్ రంగరమేష్, శ్యామల రైస్ మిల్లు అధినేత గొడవర్తి శివరామకృష్ణ, కేడీసీసీ బ్యాంకు ఏజీఎం మాటూరి శ్రీనివాస్, అమ్మ కనస్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగానాథ్, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఈసీఈ డేటా సైన్సు విభాగాధిపతులు రంగారావు, అక్బర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్యారమ్స్ పోటీలు


క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

గుడివాడ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా చౌటపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, క్యారమ్స్ ఆడించారు. బాలబాలికలచే వివిధరకాల ఆటలు ఆడించారు. గ్రంథాలయ అధికారి జి.రత్న చంద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించి వారిని అభినందించారు.

పెదపారుపూడి : వేసవి శిక్షణా తరగతులలో భాగంగా మంగళవారం పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులను అడిగిన వివిధ రకాల ప్రశ్నలకు స్ఫూర్తివంతమైన సమాధానాలు చెప్పారు. అనంతరం విద్యార్థులు పంచతంత్రం, రామాయణం కథలను చార్టు మీద అర్థవంతంగా ప్రదర్శించారని గ్రంథాలయాధికారిణి ఎంవీఎస్.లక్ష్మీ తెలిపారు. విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

గుడివాడ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వలివర్తిపాడు పీఏసీఎస్‌లో మంగళవారం మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పంచకర్ల బ్రహ్మయ్య, రేమల్లి రజనీకాంత్, సాయిన దుర్గాప్రసాద్, గుడవల్లి నరసింహారావు తదితరుల ఆధ్వర్యంలో వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఆర్ఎస్‌కే వీఏఏ ఆమోస్ ఆధ్వర్యంలో ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలు పంపిణీ చేశారు.

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి

పెదపారుపూడి : ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 65 ఏళ్ల దాటిన వృద్ధులకు రేషన్‌ను ఇంటికి తీసుకెళ్లి ఇవ్వాల్సిందిగా పెదపారుపూడి తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. మంగళవారం పెదపారుపూడి రేషన్‌షాపు నెంబర్ 0640001 సిబ్బంది వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అర్థరహితం

● జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్

పామర్రు : పామర్రు నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్ రాజాపై అవినీతి సామ్రాట్‌గా పేరొందిన పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చేస్తున్న ఆరోపణలు పూర్తి అర్థరహితమైనవని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన నేతలు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు జగన్ మద్దతు సిగ్గుచేటు

తోట్లవల్లూరు : తెనాలిలో గంజాయి, మాదక ద్రవ్యాలు అమ్మే రౌడీ షీటర్లకు వైఎస్ జగన్ మద్దతుగా నిలవటం సమాజానికి ఏమి సందేశం ఇస్తున్నారని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510



సత్రంపాలెం సెంటర్ రోడ్డుకు మరమ్మతులు

మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మసూలా బీచ్ ఫెస్టివల్ నేపథ్యంలో సత్రంపాలెం సెంటర్‌లో రోడ్డుకు మంగళవారం మరమ్మతులు చేశారు. గోతులను పూడ్చారు. సత్రంపాలెం సెంటర్ రోడ్డు దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందించి మంత్రి కొల్లు రవీంద్ర వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చినగొల్లపాలెం అభివృద్ధికి ప్రత్యేక కృషి


చినగొల్లపాలెంలో మాట్లాడుతున్న బాలశౌరి

కృత్తివెన్ను, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : చినగొల్లపాలెం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. చిన గొల్లపాలెంలో మంగళవారం ఆయన పర్యటించి గ్రామస్థులనుద్దేశించి ప్రసంగించారు. ఇప్పటికే గ్రామంలో కెనరా బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేసి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.50 లక్షల నిధులను విడుదల చేశామన్నారు. త్వరలో మరో రూ.50 లక్షలు అందించి నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. దీవి కోతకు గురికాకుండ చర్యలు చేపడతామన్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికను పంపామని, చర్చలు జరుగుతున్నాయన్నారు. పెడన నియోజకవర్గంలో ప్రతి మారుమూల గ్రామానికి తాగునీరు అందించేందుకు, కృష్ణ జలాలను నది నుంచే నేరుగా పైప్‌లైన్ ద్వారా శివారుకు సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



కోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణాపురంలో ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. బ్యాంక్ మేనేజర్ మద్ది వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో బ్యాంకు భవన నిర్మాణం పూర్తి చేసి బ్యాంక్‌ను పునఃప్రారంభించి 200 మం దికి రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మాజీ గ్రామసర్పంచ్ అద్దంకి పాండురంగారావు రామకృష్ణాపురం గ్రామంలో తుఫాన్ షెల్టర్, హెల్త్ సెంటర్, వాటర్ ట్యాంక్ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ తెలిపారు. గ్రామసర్పంచ్ దేవనబోయిన కనకదుర్గ, మండలి వెంకట్రామ్, కూటమి నాయకులు మర్రే గంగయ్య, కోటేశ్వరరావు, కాగిత రామా రావు, పూతబోయిన సాయిబాబు, గుడివాక శేషుబాబు, యాసం చిట్టిబాబు, పూతబోయిన కరుణ కుమార్, కోట రాంబాబు, యర్రంశెట్టి దామోదర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పెడన హిందూ శ్మశానవాటికకు రూ.కోటిన్నర నిధులు ఇస్తా : ఎంపీ

పెడన, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పెడనలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి కోటిన్నర రూపాయల నిధులు ఇస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సారధ్యంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ఎంపీని కలిసి శ్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. బాలశౌరి మాట్లాడుతూ, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తనను ఎప్పుడు కలిసినా శ్మశాన వాటిక అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను చెబుతూ వస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కాగిత చెప్పిన మీదట, పలువురితో మాట్లాడిన తరువాత శ్మశాన వాటికను అభివృద్ధి చేయాల్సిన ప్రాధాన్యతను గుర్తించానన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా శ్మశాన వాటిక అభివృద్ధికి రాష్ట్రం నుంచి నిధులు తీసుకురావడం సాధ్యమయ్యే పనికాదని స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నాలుగైదు నెలల్లో శ్మశాన వాటిక అభివృద్ధికి కోటిన్నర రూపాయల నిధులు సమకూరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థలతో చర్చలు జరుపుతున్నామని ఆయన తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యులు కూడా శ్మశాన వాటిక అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, శ్మశాన వాటిక అభివృద్ధికి త్వరలో నిధులు మంజూరవుతాయన ఆశాభావం వ్యక్తం చేశారు. బాలశౌరి, కృష్ణప్రసాద్‌లను అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. బాలశౌరిని కలిసిన వారిలో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు ఊటుకూరి శివప్రసాద్, అధ్యక్షుడు బొడ్డు దీక్ష, ఉపాధ్యక్షుడు బళ్ళ ప్రసాద్, కార్యదర్శి వాసా సాంబశివరావు, కోశాధికారి ఊటుకూరి ప్రకాశరావు, సభ్యులు కమ్మగంటి బాబు, తమ్మా బీమయ్య, పృధ్వి వినోద్, ఉట్ల మహదేవమూర్తి, వాసుదేవరావు తదితరులు ఉన్నారు.


మోపిదేవి హాస్టల్‌లో పనుల పురోగతిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మండలి

హాస్టళ్లలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

మోపిదేవి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి పనులు ఈనెల 10లోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మోపిదేవిలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్, బీసీ ఆశ్రమ వసతి గృహంలో చేపట్టిన పనుల పురోగతిని మంగళవారం ఆయన పరిశీలించారు. బాలికల వసతిగృహంలో డైనింగ్ కం లివింగ్ రూమ్ శ్లాబు దశలోనే ఉండటంతో ఏపీ విద్యాసంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ ఏఈ రాజేష్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో వంట గది అభివృద్ధి పని ఇప్పటికీ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. పనుల్లో జాప్యాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొల్లి మురళీకృష్ణ, రావి నాగేశ్వరరావు, అధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.


నాట్యశిక్షణ పొందిన చిన్నారులతో అతిథులు

ముగిసిన నాట్యశిక్షణ తరగతులు

చల్లపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పురిటిగడ్డ కృష్ణసాయి ధ్యానమందిర కల్యాణ మండపంలో నెలరోజుల పాటు నిర్వహించిన యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, కూచిపూడి నాట్యశిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా కూచిపూడి నాట్యప్రదర్శన జరిగింది. శిక్షణ పొందిన వారికి అతిథుల చేతులమీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. విశ్రాంత ఆర్టీవో, ధ్యానమందిరం ట్రస్టీ నాదెళ్ల శివరామకృష్ణ-రజితలక్ష్మి దంపతులు, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి, ఉపాధ్యాయుడు రామకృష్ణ, డ్యాన్స్ మాస్టర్ దాలిపర్తి మెహెర్ దుర్గా నరసింహారావు, గ్రామ పెద్దలు పరుచూరి సురేష్, దేవభక్తుని గోపాలకృష్ణ పాల్గొని చిన్నారులను అభినందించారు. తరగతుల నిర్వహణకు సహకరించిన నాదెళ్ల శివరామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.


ఉద్యోగాలకు ఎంపికైన వారితో సీఐ ఈశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ కనకదుర్గ, కరస్పాండెంట్ శివప్రసాద్

మెగా జాబ్‌మేళాకు మంచి స్పందన

చల్లపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించి మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచీ 383 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా, 11 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 63 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ అతిథులుగా పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు అందజేశారు. కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్స్ పి.రమేష్‌బాబు, షేక్ అబ్దుల్ రహీం పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

కోడూరులో కిసాన్ జల, జన జాగరణ యాత్ర

కోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంత రక్షణ, కాలుష్య నివారణ లక్ష్యంగా జల, జన జాగరణ యాత్ర చేపట్టినట్లు భారతీయ కిసాన్ సంఘ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుముల గాంధీ అన్నారు. మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానిక 11వ నెంబర్ పంట కాలువ, పాలకాయితిప్ప అవుట్ పాల్ స్లూయిస్‌లను పరిశీలించారు. రైతు సంఘం నాయకులు రేపల్లె యోగ ప్రకాష్ (రాము) రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. భారతీయ జనతా పార్టీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.నగరాయులు, మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ గుడిసేవ సూర్యనారాయణ, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేతలు కొండవీటి రామకృష్ణ, కోట సత్యనారాయణ, చెరుకూరి వేణుగోపాల్, బచ్చు పూర్ణచంద్రరావు, రైతు మోపిదేవి చక్రవర్తి, కోట కృష్ణమోహన్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు రైతులు పాటించాలి

చల్లపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షల ఆవశ్యకత, వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తల సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కోరారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పిలుపుమేరకు మంగళవారం యార్లగడ్డలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సార్వాపంటకు అనువైన వరి రకాలు, ఆరోగ్యవంతమైన నారు పెంపునకు సూచనలు అందించారు. ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, సస్యరక్షణ యాజమాన్యం, భూసార పరీక్షల ప్రయోజనాలు తెలియచేశారు. ఆయిల్‌పామ్ సాగులో యాజమాన్య పద్ధతులను తెలిపారు. ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, డాక్టర్ బి.కల్యాణ్ బాబు, డాక్టర్ భాస్కర్ రెడ్డి, ఏవో జి.సాయిసింధు, ఉద్యానవన శాఖ అధికారిణి జె.కీర్తి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. క్షేత్ర సందర్శనలో డ్రోన్ ద్వారా మందుల పిచికారీ విధానాన్ని రైతులకు తెలియజేశారు.

వరి వంగడాలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన

నాగాయలంక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం చోడవరం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ కొత్త వరి వంగడాలపై అవగాహన కల్పించారు. మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు వివిధ నేలలకు అనువైన వరి రకాలు, యాజమాన్య పద్ధలు వివరించారు. పెదవేగి ఆయిల్ పామ్ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బన్న ఆయిల్ పామ్ సాగులో యాజమాన్య పద్ధలును వివరించారు. ఏవో సంజీవ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను, సేంద్రియ వ్యవసాయం ఉపయోగాలను వివరించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్.సాయి మౌనిక పశుసంవర్థక అందించే వివిధ పథకాలను వివరించారు.


మత్స్య పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

సముద్ర కాలుష్యాన్ని నిరోధించాలి

నాగాయలంక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత మత్స్యకారుల్లో చైతన్యం పెంచి సముద్ర కాలుష్యాన్ని నిరోధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. భావదేవరపల్లి ప్రభుత్వ మత్స్య పాలిటెక్నిక్ కళాశాలలో ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సముద్ర మత్స్య వనరులు, కాలుష్యం నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ, మడ అడవుల విస్తీర్ణం పెంచటం ద్వారా విపత్తుల తీవ్రత నియంత్రించాలన్నారు. ఫిషరీ అధికారులు సి.ధనుంజయరావు, టి.సుగుణ, జి.వి.ఎ.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.చంద్రశేఖరరావు, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, విద్యార్థులు ప్రసంగించారు. మత్స్యకారుల ఆధునాతన పరికరాల ప్రదర్శన ఆకట్టుకుంది. తొలుత కళాశాల విద్యార్థులు ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు 6 నుంచి

నాగాయలంక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : టి.కొత్తపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో 8వ తేదీ ఉదయం 7.45 నిముషాలకు గూడూరు రామకృష్ణ శర్మచే గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపింది. ప్రతిష్ఠ సందర్భంగా 6, 7 తేదీల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

బక్రీద్ రోజున గోవధ జరగకుండా చూడాలి


ముస్లిం పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగేంద్రప్రసాద్

పెడన, మే 3 (ఆంధ్రజ్యోతి) : బక్రీదు సందర్భంగా గోవధ జరగకుండా చూడాలని సీఐ నాగేంద్రప్రసాద్ ముస్లిం ప్రముఖులకు సూచించారు. ఈనెల 7న బక్రీద్ పండుగ నేపథ్యంలో ఆయన మంగళవారం పెడన పోలీసు స్టేషన్‌లో ముస్లిం ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. గోవధపై నిషేధాజ్ఞలు ఉన్నాయన్నారు. ఉల్లంఘించి గోవధకు పా ల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గత ఏడాది గోవధ సందర్భంగా గొడవలు జరిగి కేసులు నమోదయ్యాయని ఆ యన గుర్తు చేశారు. సమావేశంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్సై జి. సత్యనారాయణ, ముస్లిం ప్రముఖులు అబ్దుల్ ఖదీర్, అయూబ్‌ఖాన్, అబ్దుల్ ఖయూం, హమీదుల్లా తదితరులు పాల్గొన్నారు.

20 వేల మందికి అన్నసమారాధన

అవనిగడ్డ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. దాదాపు 20 వేల మందికిపైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గత నెల 22వ తేదీన హనుమజ్జయంతి నాటి నుంచి ప్రతి నిత్యం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, మంగళవారం భారీ అన్నదానం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ పర్యవేక్షించింది.



మునేశ్వరరావుకు టీడీపీ నేతల సన్మానం

కోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు 400 కిలోమీటర్ల సైకిల్‌పై వెళ్లిన టీడీపీ కార్యకర్త ధూళిపూడి మునేశ్వరరావును మండల టీడీపీ నేతలు మంగళవారం ఘనంగా సన్మానించారు.పార్టీ కార్యాలయం వద్ద శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు పూతబోయిన శ్రీనివాసరావు, అప్పికట్ల రవీంద్ర, పిల్లి మల్లిఖార్జునరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, స్థానిక పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొలువుదీరిన ఘంటసాల మార్కెట్ కమిటీ

ఘంటసాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం కొలువు దీరింది. ఛైర్‌పర్సనగా తోట కనకదుర్గ, ఉపాధ్యక్షుడిగా అత్తులూరి గోపిచంద్, డైరెక్టర్లుగా గుత్తి ధనలక్ష్మి, జంధం కోటేశ్వరమ్మ, కొక్కిలిగడ్డ సరళకుమారి, కోలపల్లి శ్రీవర్ష, కొమరగిరి నాగిని, కోన రాజశేఖర్, కుక్కల కృష్ణ కుమారి, నాదెళ్ల వెంకట నరసయ్య, షేక్ ఇబ్రహీం, సూదాని నందగోపాల్, అంకాని మ హేంద్ర, చుండూరి రామకోటేశ్వరరావు, చుండూరి మెహర్ వెంకట రామకృష్ణ, సత్య వరప్రసాద్, చల్లపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు, మొవ్వ ఏడీఏ, కొడాలి గ్రామపంచాయతీ సర్పంచ్, మార్కెటింగ్ ఆఫీసర్ బాధ్యతలు స్వీకరించారు.

2కె రన్‌లో తెలుగుయువత కేరింతలు



మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో మంగళవారం జరిగిన 2కె రన్‌లో తెలుగుయువత ఉత్సాహంగా పాల్గొన్నారు. మంత్రి కొల్లు రవీంద్రను తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ ఆధ్వర్యంలో భుజాలపై ఎత్తుకుని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. తెలుగుయువత నాయకులు కేరింతలు కొడుతూ ర్యాలీలో పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు నేటి నుంచి

చల్లపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పురిటిగడ్డలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పురిటిగడ్డ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణకు చేరిన ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మించారు. బుధవారం ప్రతిష్ఠా పూజలు ప్రారంభం కానుండగా, గురువారం అధివాస హోమాలు, పూజలు, శుక్రవారం ఉదయం గం.9.37 లకు యంత్రస్థాపన, ఆలయ శిఖర ధ్వజ దండ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, అనంతరం అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కోట ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం

ఘంటసాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కోట ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో అభివృద్ధి పనుల నిమిత్తం ఘంటసాల గ్రామానికి చెందిన తుమ్మలచర్ల దివ్య రూ.13100 విరాళాన్ని అందజేశారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన దివ్య ట్రస్టీ వేమూరి ప్రవీణ్‌కు నగదు అందజేశారు. మూల్పూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

పెడన రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలు ఆరోగ్యం విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరక్టర్ ఎం.ఎన్ రాణి అన్నారు. కాకర్లమూడిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహలు అరికట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో 40 మంది కిశోర బాలికలు పాల్గొన్నారు. సీడీపీవో సముద్రవేణి, సూపర్‌వైజర్ కె.శ్రావణికుమారి, షబనా పర్వీన్, విజయలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సమస్యలను కేబినేట్‌లో చర్చించాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిత్యం వైద్యసేవలందిస్తున్న గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని, దీనిపై కేబినెట్ సమావేశంలో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆర్ఎంపీ వైద్యుల సంఘ నాయకుడు కె.సురేష్ కోరారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఆర్ఎంపీలకు శిక్షణ తరగతులు నిర్వహించి ప్రభుత్వం గుర్తింపు కల్పించాలన్నారు.